నమస్తే తెలంగాణ
జిందగీ 2
కరీంనగర్ | శనివారం 6 ఏప్రిల్ 2024 www.ntnews.com

Fashion



సమతా చౌదరి, డిజైనర్
Samatha Chowdary@wowostudios

## నిమ్మవన్నె చిన్నెలు..

ఎండవేళ నిమ్మ మాటే చల్లటి నీటి ఊటలా ఉంటుంది. నిమ్మపండు వన్నె కళ్లకూ, మనసుకూ హాయిగొలుపుతుంది. లేత రంగుల్లోనూ మెరిసిపోవాలంటే ఈ పసిమి వర్ణాన్నే ఎంచుకోవాలి. లెమన్ ఎల్లో కలర్ ఆర్గంజా లెహెంగాకు తెలుపు రంగు క్రాప్‌టాప్‌ను జత చేశారు డిజైనర్లు. ప్రకృతి అందాలను ఆవిష్కరించేలా టాప్ మీద ఆకులూ, తీగలూ, పక్షుల బొమ్మలను త్రీడీ తరహా లుక్‌తో సునిశితంగా కుట్టారు. లెహెంగా పట్టీని కూడా జర్దోసీ, త్రెడ్‌వర్క్‌తో అలంకరించారు. వేస్తే అందంగానే కాదు, చూస్తే హాయిగానూ ఉంది కదూ ఈ జత!

## బటర్ ఫ్లై మమ్మీ!



**ముంబయిలోని** ఒక అపార్ట్‌మెంట్‌లోని 13వ అంతస్తులో ఉంటుంది ప్రియాంక. అందమైన ఫ్లాట్.. అంతకన్నా అందమైన బాల్కనీ. అందులోకి అడుగుపెడితే ముచ్చటైన పూలతోటలోకి ప్రవేశించినట్టు ఉంటుంది. దీన్ని పూలతోట కాదు.. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం అనాలేమో! ఈ బటర్ ఫ్లై బాల్కనీలో ఐదువేల సీతాకోక చిలుకలు ఉన్నాయి. వీటిలో ఏకంగా 15 జాతులు కనువిందు చేస్తుంటాయి. ఒకప్పుడు పెరట్లో సీతాకోక చిలుకలు విహరిస్తూ కనువిందు చేసేవి. ఇప్పుడు వాటికి ఆవాసాలు లేవు. పురుగు మందుల వాడకం, వాతావరణ మార్పులతో సీతాకోక చిలుకలు కనుమరుగవుతున్నాయి. ఇలాంటి సందర్భంలో.. అందునా ముంబయి లాంటి కాలుష్య పూరితమైన మహానగరంలో ఓ ఇంటి బాల్కనీ చూరుపై ఐదువేల సీతాకోక చిలుకలు వాలుతున్నాయంటే గొప్ప విషయమే. ఈ బటర్ ఫ్లైల ఆహారం కోసం ప్రియాంక తన బాల్కనీలో నిమ్మగడ్డి, ఆకుకూరలు పెంచుతున్నది. కనువిందు చేసే సీతాకోక చిలుకల కోసం ఇంటి బాల్కనీకి పచ్చకోక తొడిగిన ప్రియాంకను అందరూ 'బటర్ ఫ్లై మమ్మీ' అని పిలుస్తుంటారు.

## డీ కొంటున్నారు



**ప్రకృతి** సిద్ధంగా లభించే దివ్యౌషధం విటమిన్ డి. నయాపైస ఖర్చులేకుండా సూర్య కిరణాలు తెచ్చి ఇచ్చే విటమిన్ ఇది. కానీ, మెట్రో నగరాల్లో ఎండ కన్నెరగక ఎందరో డి విటమిన్ లోపానికి గురవుతున్నారు. మహానగరాల్లో ఉండే 80 శాతం మంది మహిళలు, చిన్నారుల్లో విటమిన్ డి లోపం ఉన్నట్టు పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నగరాల్లో లేత ఎండ ఇంట్లోకి చొరబడే అవకాశం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతున్నదని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనదేశ జనాభాలో 50 శాతం మందికి విటమిన్ డి లోపం ఉందని అంచనా. ఇందులో 30 శాతం మంది చిన్నారులు, యువత ఉండటం ఆందోళన కలిగించే విషయం. విటమిన్ డి శరీరానికి సరిపడా అందకపోతే రోగనిరోధకశక్తి తగ్గుతుంది. నీరసం ఆవహిస్తుంది. ఎముకలు బలహీనమవుతాయి. ఈ లోపాన్ని అధిగమించడానికి వందలు వెచ్చించి విటమిన్ డి సప్లిమెంట్స్ కొంటున్నారు కూడా! అయితే, ఔషధాలపై ఆధారపడటం కన్నా... పొద్దున్నే ఓ ఇరవై నిమిషాల పాటు ప్రత్యక్ష నారాయణుడి సేవ చేసుకోవడమే మంచిదని పరిశోధకులు సెలవిస్తున్నారు.

చిన్నతెర

# ఊసులన్నీ ఉత్తరాల్లోనే..

మంజుల.. చంద్రముఖిగా తెలుగు బుల్లితెరకు పరిచయమై తెలుగింటి కోడలైంది. మంజులా నిరుపమ్ పరిటాలగా అందరికీ సుపరిచితమైంది. పదహారేండ్లకే సీరియల్స్‌లో హీరోయిన్‌గా అవకాశం అందుకున్న ఆమె.. మాతృభాష కన్నడంతోపాటు తెలుగు, తమిళ పరిశ్రమలోనూ రాణించింది. తొలినాళ్లలో పాజిటివ్ క్యారెక్టర్స్‌తో అలరించిన ఈ నటి సెకండ్ ఇన్నింగ్స్‌లో నెగెటివ్ రోల్స్‌లో తన ప్రతిభను నిరూపించుకుంటున్నది. జీ తెలుగులో ప్రసారమవుతున్న 'సీతే రాముడి కట్నం' సీరియల్‌లో మహాలక్ష్మిగా ప్రేక్షకులను రోజూ పలకరిస్తున్న మంజులా నిరుపమ్ జిందగీతో పంచుకున్న కబుర్లివి..

**ఒకే** తరహా పాత్రలు చేస్తే కొత్తేం ఉంటుంది. అందుకే కమ్‌బ్యాక్ తర్వాత నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ ఎంచుకుంటున్నా. ప్రతినాయిక ఛాయలున్న పాత్రలు చేసినప్పుడు మనలోని ప్రతిభ బయటపడుతుంది. ప్రస్తుతం నేను చేస్తున్న రెండు సీరియల్స్‌లోనూ నెగెటివ్ షేడ్స్ ఉన్న రోల్స్‌లో కనిపిస్తున్నా. విలన్ అనగానే ప్రేక్షకులు ఒకరకంగా ఊహించుకుంటారు. నా నటనతో ఆ భావన వారిలో కలిగించేలా చేయగలిగితే యాక్టర్‌గా నేను విజయం సాధించినట్లే!

### నాన్న ప్రోత్సాహంతో..

మాది బెంగళూరు. పుట్టి పెరిగిందంతా అక్కడే. మేం నలుగురం అక్కాచెల్లెళ్లం. నేను రెండో అమ్మాయిని. చిన్న చెల్లి కూడా నటి. నాన్న పోలీస్ డిపార్టుమెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి సీఏ అవ్వాలనేది నా కోరిక. అనుకోకుండా ఈ రంగంలోకి వచ్చాను. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, కుటుంబ బాధ్యతల వల్ల ఆయన కోరిక తీరలేదు. అందుకే మా చిన్న చెల్లిని బాలనటిగా పరిచయం చేశారు. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు, నాన్న స్నేహితులు సీరియల్ కోసం కొత్త టాలెంట్ కావాలని వెతుకుతున్నారని తెలిసింది. నాన్న నన్ను ప్రయత్నించమన్నారు. స్క్రీన్ టెస్ట్‌లో పాసయ్యాను. అలా నటిగా నా కెరీర్ మొదలైంది. నేను నటించిన ఫస్ట్ సీరియల్ 'ప్రేమ పిశాచి'. అప్పటికి నాకు యాక్టింగ్ అంటే ఏంటో తెలియదు. సీరియల్ వాళ్లే యాక్టింగ్‌లో శిక్షణ ఇచ్చారు. మొదటి సీరియల్‌కే పాపులర్ కావడంతో కాలేజీలో స్టార్ అయిపోయాను. అందరూ వచ్చి ఆటోగ్రాఫ్ అడిగేవాళ్లు. చాలా గర్వంగా, సంతోషంగా అనిపించేది.

### ఆరు నెలలు పట్టింది..

మొదటి సీరియల్ తర్వాత వరుసగా అవకాశాలు వచ్చాయి. సినిమా ఆఫర్లూ వచ్చాయి. కానీ, నాకు సీరియల్స్‌లో నటించడం అంటేనే ఇష్టం. సినిమా షెడ్యూల్, షూటింగ్ సీరియల్స్‌కు పూర్తి భిన్నంగా ఉంటాయి. అందుకే ఆసక్తి చూపించలేదు. తెలుగులో నా మొదటి సీరియల్ 'చంద్రముఖి'. ఆ సీరియల్ ఓకే చెప్పినప్పుడు నాకు తెలుగు అస్సలు రాదు. ప్రాంప్టింగ్, డబ్బింగ్ ఉన్నప్పటికీ.. కంగారయ్యేది. మూడు నెలల్లోనే తెలుగుపై కొంత అవగాహన వచ్చింది. ఈ సీరియల్ షూటింగ్ అప్పుడే నిరుపమ్‌తో పరిచయమైంది. మాకు ఫోన్ నెంబర్ మార్చుకోవడానికి ఆరు నెలలు పట్టింది. గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ మెసేజ్‌లతో మొదలైన మా చాటింగ్.. ఒకరంటే ఒకరు ఇష్టపడేంత వరకు వెళ్లింది. మాది ప్రేమా, కాదా అని తెలుసుకునేందుకు నిరుపమ్ ఒక టెస్ట్ పెట్టారు. అదేంటంటే.. ఒక షెడ్యూల్ నుంచి మరో షెడ్యూల్ వరకు మాట్లాడుకోకూడదు, ఏదైనా చెప్పాలనిపిస్తే ఉత్తరాలు రాసుకోవాలని అనుకున్నాం. కానీ కొన్నాళ్లకి తనే ఫోన్ చేశాడు. నాతో మాట్లాడకుండా ఉండటం తనవల్ల కావట్లేదని, నన్ను ప్రేమిస్తున్నానని చెప్పాడు. పెద్దలు ఒప్పుకోవడంతో పెండ్లి చేసుకున్నాం. పెండ్లి తర్వాత కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనుకున్నా. అందుకే పరిమితంగా సీరియల్స్ చేశా! బాబు పెరిగిన తర్వాత మళ్లీ వరుస సీరియల్స్ చేస్తున్నా.



### అభిమానుల ఆశీర్వాదమే..

నిరుపమ్‌కు డైహార్డ్ ఫ్యాన్స్ ఉన్నారు. ఒకరైతే ఆయన పేరు టాటు వేయించుకున్నారు. సోషల్ మీడియాలో ఆయన పేరుమీద, నా పేరిట కొన్ని వందల ఫ్యాన్ పేజీలు క్రియేట్ చేశారు. మాకు సంబంధించిన ప్రతి సందర్భాన్ని మాకంటే ఎక్కువగా వాళ్లే సెలబ్రేట్ చేస్తారు. అభిమానులు లేకపోతే మేం ఈ స్థాయికి వచ్చేవాళ్లం కాదు. వారితో ఇన్‌స్టా వేదికగా మాట్లాడుతుంటాను. అలంకరించుకోవడం అంటే నాకు చాలా ఇష్టం. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం నేను చేస్తున్న రెండు పాత్రలు కూడా నిండుగా అలంకరించుకునేవే కావడం చాలా సంతోషంగా ఉంది. నిజానికి అందం అనేది బయటికి కనిపించేది కాదని నమ్ముతాను. మన ఆలోచనలు, ఆచరణల్లో దాగి ఉండే నిష్కల్మషమైన తత్వమే నిజమైన అందం.

... హరిణి



ధాన్యగుణ జట్టు



ప్రెగాకేర్ టీమ్

# సవాళ్లే బీజాలై.. సరికొత్త యంత్రాలై!

స్టార్టప్ స్టోరీస్

**కాలేజీల్లో హ్యాపీడేస్ ఎంజాయ్ చేసే సాదాసీదా విద్యార్థులు కాదు వాళ్లు.. తమ చుట్టూ ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను వెదుకుతూ ఆంత్రప్రెన్యూర్లుగా ఎదగాలని కలలు కంటున్నారు. ఆ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే సవాళ్లనే తమ ప్రయోగాలకు బీజాలుగా చేసుకుని అధునాతన పరికరాలు, యంత్రాలకు రూపమిస్తున్నారు. తాజాగా యంగ్-కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ ప్రకటించే నగదు బహుమతిని గెలుచుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించిన అంకుర సంస్థలపై ఈ వారం స్టార్టప్ స్టోరీ.**

**అధ్యాపకులిచ్చిన** ప్రాక్టికల్స్ అసైన్‌మెంట్ రిపోర్టులు రాయడానికే పరిమితం కాకుండా ప్రయోగాలను ఆచరణలోకి తీసుకువచ్చి సర్వీస్ ప్రొవైడర్లుగా మారుతున్నారు కొందరు విద్యార్థులు. గర్భిణులకు వైద్యసేవలను ఒకేచోట అందించాలని 'బద్రుకా' విద్యార్థుల బృందం ప్రెగాకేర్ ప్రాజెక్టును ఆవిష్కరిస్తే.. ధాన్యం ఆరబెట్టడానికి ఆధునాతన పరికరాన్ని తయారుచేశారు 'సీబీఐటీ' విద్యార్థులు.

### ప్రెగాకేర్‌తో గర్భిణులు సురక్షితం

బద్రుకా కాలేజీలో బీబీఏ చదువుతున్న మిర్యానం రిషిత, మాళవిక పడవ, మిథాలీ సిన్హా, వొర్రే అభిషేక్ శెట్టి బృందం గర్భిణులకు సేవలు అందించడంలో దాగి ఉన్న బిజినెస్ కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేశారు. నెలలు నిండుతున్నవారికి మెడికేషన్, డాక్టర్ కన్సల్టేషన్, వైద్యపరీక్షలు, న్యూట్రిషన్, మెంటల్ వెల్‌బీయింగ్, డెలివరీ, పోస్ట్ డెలివరీ సేవలను కలిపి అందించే ప్రాజెక్టును తీర్చిదిద్దారు. అందుకు కావాల్సిన టెక్నాలజీ, నెట్‌వర్క్‌తోపాటు మ్యాన్‌పవర్, స్కిల్స్‌తో సమగ్ర ప్రాజెక్టుగా 'ప్రెగాకేర్'ను మెంటార్ మిథేశ్ సాయంతో డిజైన్ చేశారు. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఈ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్టార్టప్‌ను ప్రారంభించారు. వైద్యరంగంలో ఇలాంటి సేవలు అందించే అప్లికేషన్లు, సంస్థలు ఇప్పటికే ఉన్నప్పటికీ గర్భిణులకు మాత్రమే ఈ తరహా సేవలు అందించే సంస్థలు లేవని చెబుతున్నది 'ప్రెగాకేర్' ఫౌండర్ బృందం. ముఖ్యంగా గర్భిణులకు అందించే వైద్యసేవల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దీనిని డిజైన్ చేశామని బృంద సభ్యురాలు రిషిత చెబుతున్నది. 'ప్రస్తుతం ఇంక్యుబేషన్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రాజెక్టు కాన్సెప్ట్‌పై పేటెంట్ కోసం కూడా దరఖాస్తు చేశాం. ప్రెగాకేర్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా డెలివరీకి అవసరమైన సేవలను పొందే వీలు ఉంటుంది. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత మా సేవలను విస్తరిస్తాం' అంటున్నది రిషిత. 'సామాన్యులకు అందుబాటులో ఉండే ధరల్లోనే సేవలు అందిస్తాం!' అంటున్నారు ప్రెగాకేర్ ఫ్రెండ్స్.

### ధాన్యం ఎండబెట్టే ఆధునిక యంత్రం

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించే రైతులకు అడుగడుగునా గండాలే. పంటను విక్రయించే సమయంలో అన్నదాతలకు అత్యంత కీలకమైనది సానుకూల వాతావరణం. పంట కోసిన తర్వాత రోడ్లకు ఇరువైపులా ధాన్యాన్ని పోసి ఆరబెట్టడం మనం చూస్తుంటాం. ఆ దారిన పరచిన వరికుప్పలు, మక్కజొన్న గుట్టలు చూసిన బీటెక్ విద్యార్థినికి అధునాతన ఎయిర్ డ్రయర్‌ను తయారుచేయాలనే ఆలోచన కలిగింది. గింజలను శాస్త్రీయంగా స్కాన్ చేసి, అమ్మకానికి సరిపడా తేమశాతంతో ఆరబెట్టేలా 'ధాన్యగుణ' పరికరాన్ని తోటి విద్యార్థులతో కలిసి డిజైన్ చేసింది. సీబీఐటీలో బీటెక్ చదువుతున్న శృతిలయ, భవ్యశ్రీ, వర్షితతోపాటు మరికొందరు ఇంక్యుబేషన్ సెంటర్ మెంటార్ల సహకారంతో 'ధాన్యగుణ'ను డెవలప్ చేశారు. గంటల వ్యవధిలోనే వేగంగా ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు, గింజల్లోని టాక్సిన్లను తొలగించడం ధాన్యగుణ ప్రత్యేకత. నీట మునిగిన ధాన్యం గింజలను సైతం ఆరబెట్టడానికి వీలు ఉండేలా దీన్ని తీర్చిదిద్దారు. తక్కువ నిర్వహణ వ్యయంతో ఎక్కడికైనా తీసుకెళ్లేలా డెవలప్ చేసిన ఈ ఎయిర్ డ్రయర్... రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నది 'ధాన్యగుణ' బృందం. ప్రస్తుతం ఈ తరహా యంత్రాలు మార్కెట్లో ఉన్నప్పటికీ అవన్నీ పోర్టబుల్, మూవబుల్ ఎయిర్ డ్రయర్స్ కాదని చెబుతున్నారు. వాటితో పోల్చితే దీని ధర తక్కువ అని.. రూ.50 వేల లోపే ఉంటుందని, రవాణా ఖర్చులతో కలిపి రూ.60 వేలు ఖరీదు చేస్తుందని తెలిపారు. రైతులకు తక్కువ ఖర్చుతో సేవలను అందించేందుకు సిద్ధమవుతున్నట్టు ధాన్యగుణ కో ఫౌండర్ శృతిలయ వివరించింది.

### యంగ్-కోవే అండతో..

ఆంత్రప్రెన్యూర్‌షిప్ వైపు అడుగులు వేస్తున్న ఈ విద్యార్థులకు యంగ్-కోవే అండగా నిలుస్తున్నది. తెలంగాణవ్యాప్తంగా ఉన్న 100కు పైగా కాలేజీలతో ఈ సంస్థ నెట్‌వర్క్ కలిగి ఉన్నది. విద్యార్థుల్లో స్టార్టప్ ఆలోచనలను గుర్తించి, వారు పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించుకునేలా కృషి చేస్తున్నది. ఏటా ఫెమ్‌ప్రెన్యూర్ పేరిట ప్రత్యేక పోటీలను నిర్వహించి ఉత్తమ ఆలోచనలకు నగదు పురస్కారంతోపాటు నేరుగా తమ వద్దే ఇంక్యుబేట్ అయ్యేందుకు అవసరమైన ఆర్థిక, వ్యాపార మెలకువలు నేర్పుతున్నది.

### ఈ రెండే అత్యున్నతం

యంగ్-కోవే ఈ ఏడాది నిర్వహించిన ఫెమ్‌ప్రెన్యూర్ పోటీలకు వచ్చిన 33 స్టార్టప్ ఆలోచనల్లో ప్రెగాకేర్, ధాన్యగుణ ఉత్తమమైనవిగా నిలిచాయి. పోటీకి వచ్చిన అన్ని ఆలోచనలను పలు దఫాలుగా వడబోసి ఆరింటిని ఎంపిక చేశారు. అందులోంచి బెస్ట్ ఆఫ్ త్రీ ఎంపిక చేయగా 'ప్రెగాకేర్' మొదటి స్థానంలో, 'ధాన్యగుణ' రెండో స్థానంలో నిలిచాయి. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవసరమైన సహకారం యంగ్-కోవే ఇస్తుందని, సుస్థిర వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు యంగ్-కోవే చైర్మన్ శ్రీనిత్య వెల్లడించారు.

... కడార్ల కిరణ్

# పరీక్షకు గురిచేయకండి

**ఇది** పిల్లలకు పరీక్షల కాలం. ఏడాదంతా చదువుకున్నదంతా రెండున్నర గంటల వ్యవధిలో పేపర్ మీద పెట్టేయాలి. పరీక్షలప్పుడు పిల్లలు నిద్ర లేచింది మొదలు చదువుకొమ్మని సూచిస్తుంటారు తల్లిదండ్రులు. తమకన్నీ వచ్చని పిల్లల సమాధానం. ఇదీ తంతు! తీరిక దొరికిందే తడవుగా గ్యాడ్జెట్లకు అతుక్కుపోయే ఈ తరం చిన్నారుల దృష్టిని చదువుపైకి మళ్లించడం అంటే మాటలు కాదు. అలాగని ఒత్తిడి చేయడమూ సరికాదు. మరి మధ్యే మార్గం ఏంటి!?

**పిల్లల** తెలివితేటలకు పరీక్షల ఫలితాలే గీటురాయి అని చాలామంది తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, మార్కులు, ర్యాంకుల పోటీ పిల్లలను ఒత్తిడికి గురిచేస్తుంది. మార్కులు తక్కువ వచ్చినా ఫర్వాలేదని చెప్పమని కాదు, ఒకవేళ తక్కువగా స్కోర్ చేస్తే మందలించడం, దండించడం లాంటివి చేయకండి.

**పరీక్షలు** దగ్గరపడే కొద్దీ పిల్లలను అన్ని సరదాలకూ దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తుంటారు. తెల్లవారుజామున అలారం పెట్టి నిద్ర లేపుతుంటారు. పక్కన కూర్చొని మరీ చదివించే ప్రయత్నం చేస్తారు. ఇవన్నీ విపరీత చర్యలే! ఏడాదంతా చూసీ చూడనట్టుగా వ్యవహరించి.. పరీక్షలకు వారం ముందు బెత్తం పట్టుకొని సాధిస్తామంటే కుదరదు. వాళ్లేం చదువుతున్నారో.. మొదటి నుంచీ గమనిస్తే, పరీక్షలప్పుడు కటువుగా వ్యవహరించే పరిస్థితి ఉండదు.

**మరికొందరు** తల్లిదండ్రులు పరీక్షల వేళ.. పిల్లలను అస్సలు పట్టించుకోరు. వివాహాలు, విందులని తిరుగుతుంటారు. ఈ వైఖరి ముమ్మాటికీ సరికాదు! పరీక్షలప్పుడే ఉగాది, శ్రీరామనవమి పండుగలు, చైత్ర మాసం కావడంతో చుట్టాల పెండ్లి పిలుపులు అందుతూనే ఉంటాయి. వీటి మోజులో పడి పిల్లలను నిర్లక్ష్యం చేయకండి.

**ప్రతి** పరీక్షా కాలంలో తగుదునమ్మా అని ఐపీఎల్ సీజన్ కొనసాగుతుంటుంది. రెండో తరగతి పిల్లాడి నుంచి డిగ్రీ చదివే యువత వరకు అందరూ ఐపీఎల్ అభిమానులే! పైగా స్మార్ట్‌ఫోన్‌లో లైవ్ మ్యాచ్ చూసే వెసులుబాటు ఉండటంతో.. ఆట నుంచి దృష్టిని మళ్లించడం కష్టమే! ఒక్క మ్యాచూ చూడొద్దని ఆంక్షలు విధించే బదులు.. నచ్చిన జట్ల మ్యాచ్‌లు చూడనిస్తే సరి! అప్పుడు మిగతా మ్యాచ్‌ల గురించి ఆలోచించకుండా బుద్ధిగా చదువుకునే అవకాశం ఉంది. అన్నీ చూడాల్సిందే అని పట్టుబడితే దానికీ పరిష్కారం ఉంది. మ్యాచ్ ముగిశాక హైలైట్స్ చూడటానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి.

